సర్వర్ డౌన్..రిజిస్ట్రేషన్లకు బ్రేక్



నార్సింగిలోని గండిపేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం



రిజిస్ట్రేషన్ల కోసం వేచి ఉన్న ప్రజలు

మణికొండ: ప్రతిరోజు రూ.వందల కోట్ల ఆదాయం తెచ్చి పెట్టే రిజిస్ట్రేషన్ల శాఖ సర్వర్‌లు గురువారం మొరాయించాయి. దీంతో రోజంతా ఒక్క రిజిస్ట్రేషన్ సైతం కాలేదు. రోజంతా సర్వర్ పనిచేస్తుందేమో వచ్చిన పని చేసుకుని వెళ్దామని వచ్చిన వందల మంది కార్యాలయాల వద్ద పడిగాపులు కాశారు. రాష్ట్రంలోనే అత్యధిక రిజిస్ట్రేషన్లు జరిగే నార్సింగిలోని గండిపేట సబ్ రిజిస్ట్రార్, వట్టినాగులపల్లిలోని కొండా పూర్ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద రోజంతా ప్రజలు వేచి చూశారు. ప్రతి రోజు వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయని వారికి కేటాయించిన స్లాట్‌ల ప్రకారం ప్రజలు కార్యాలయానికి వచ్చినట్లు అధికారులు తెలిపారు. సాయంత్రం వరకు సర్వర్ సమస్య తీరక పోవటంతో వారంతా వెనుదిరిగి వెళ్లారని, శుక్రవారం పరిస్థితి ఉదయమే తెలుస్తుందన్నారు. రోజు వారి గంట నుంచి రెండు గంటల పాటు సర్వర్‌లు ఇదే విదంగా సతాయిస్తాయని, వాటిని మార్చటం, ఆధునికీకరించటం చేసి ప్రజల ఇబ్బందులను దూరం చేయాలని కార్యాలయాలకు రెగ్యులర్‌గా వచ్చే బిల్డర్‌లతో పాటు డాక్యుమెంట్ రైటర్‌లు కోరారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి పెట్టాలని వారు పేర్కొన్నారు.

కారు దిగేసి కాంగ్రెస్‌లోకి..!

- శంషాబాద్‌లో బీఆర్‌ఎస్ ఖాళీ
- మున్సిపల్ ఛైర్‌పర్సన్‌తో పాటు కౌన్సిలర్లు కాంగ్రెస్ గూటికి
- విపక్షంలో మిగిలేది ఒకే ఒక్కడు..

శంషాబాద్: రాజేంద్రనగర్ నగర్ నియోజకవర్గంలో వేగంగా జరుగుతున్న రాజకీయ సమీకరణాలతో శంషాబాద్ పట్టణంలో బీఆర్‌ఎస్ దాదాపుగా ఖాళీ కాబోతోంది. శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరనున్న నేపథ్యంలో ఆయనతో పాటు శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, వైస్‌చైర్మన్ గోపాల్‌తో పాటు పాటు బీఆర్‌ఎస్ నుంచి ఎన్నికైన కౌన్సిలర్లు కారు దిగేందుకు సిద్ధమయ్యారు. ఎమ్మెల్యే మాటను శిరోధార్యంగా భావిస్తున్న నేతలు కాంగ్రెస్ కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. కారుతో అవినాభావ సంబంధమున్న కొందరు సీనియర్లు ఇంకా డైలామాలో ఉన్నప్పటికీ మెజార్టీ నేతలు ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ గూటికి చేరేందుకు రెడీగా ఉన్నారు.

మిగిలేది బీజేపీ సభ్యుడు ఒక్కరే..

మున్సిపాలిటీలో 2020 జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ రెండు స్థానాలు, బీజేపీ ఒక స్థానంతో పాటు బీఆర్‌ఎస్ 15, ఏఐఎఫ్‌బీ పార్టీ ఏడు స్థానాల్లో విజయం సాధించింది. మారిన రాజకీయ సమీకరణాలతో ఏఐఎఫ్‌బీ నుంచి గెలుపొందిన కౌన్సిలర్లు బీఆర్‌ఎస్‌లో చేరారు. దీంతో మున్సిపాలిటీలో ప్రత్యర్థి పార్టీ లేకుండా పోయింది. ఇటీవల ఎంపీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో ఉన్న ఆరుగురు కౌన్సిలర్లు సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. తాజాగా శుక్రవారం జరిగే చేరికలతో 25 కౌన్సిలర్లలో బీఆర్‌ఎస్‌నుంచి చేరికలు జరిగే వారితో 24 మంది కౌన్సిలర్లుగా కాంగ్రెస్ బలం పెరగనుంది. దీంతో మున్సిపాలిటీలో బీజేపీ నుంచి గెలిచిన ప్రవీణ్‌గౌడ్ మాత్రమే విపక్ష కౌన్సిలర్‌గా మిగలనున్నాడు.

కార్మికులకు సామగ్రి పంపిణీ



నార్సింగిలో కార్మికులకు సామగ్రిని అందించిన కౌన్సిలర్‌లు

మణికొండ: మున్సిపాలిటీలో పనిచేస్తున్న కార్మికులకు రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని రెయిన్‌కోట్‌లు, సబ్బులు, నూనెలతో పాటు ఇతర సామగ్రిని పంపిణీ చేశారు. గురువారం నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని వార్డు నెంబర్2లో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ డి. రేఖయాదగిరి, 6వ వార్డు కౌన్సిలర్ పత్తి శ్రీకాంత్ రావు, 8వ వార్డు కౌన్సిలర్ పత్తి ప్రవీణ్‌కుమార్, 9వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక, 12వ వార్డు కౌన్సిలర్ జి.అమరేందర్‌రెడ్డి, 17వ వార్డు కౌన్సిలర్ కె. ఉషారాణి తమ వార్డుల పరిధిలో పనిచేస్తున్న కార్మికులకు సామగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఎలాంటి లోటు లేకుండా సౌకర్యాలను కల్పిస్తామని, ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ సేవలు అందించాలన్నారు. రాబోయే వర్షాకాలంలో ఎక్కడ ముంపునకు గురికాకుండా, ప్రజలకు రోగాలు రాకుండా పారిశుధ్య పనులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపాలిటీ శానిటేషన్ ఇన్‌చార్జి లచ్చిరాం, సానిటేషన్ సూపర్‌వైజర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



మణికొండ: నార్సింగి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2002–2003 విద్యాసంవత్సరం వారంతా కలిసి చదువుకున్నారు. విద్య పూర్తయిన అనంతరం ఎవరు ఎంచుకున్న రంగంలో వారు స్థిరపడి జీవితాలకు కొనసాగిస్తున్నారు. తాము పాఠశాల విద్య పూర్తి చేసుకుని దశాబ్దం పూర్తయిన సందర్భంగా మరో సారి కలవాలని నిర్ణయించి గురువారం నార్సింగిలో సమ్మేళనం ఏర్పాటు చేసుకున్నారు. రోజంతా తమ పాత మధురస్మృతులను మననం చేసుకుని అప్పటి వారి ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అప్పటి విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే జనాభా నియంత్రణ

అత్తాపూర్: జనాభా నియంత్రణకు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు అన్నారు. గురువారం రాజేంద్రనగర్ సూరంపల్లిలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...జనాభా నియంత్రణ కోసం ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు రావాలన్నారు. జనాభా నియంత్రణను చేపట్టకపోతే భావి తరాల భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. గతంలో జనాభా నియంత్రణకు ట్యూబెక్టమీ, వ్యాసెక్టమీ ఆపరేషన్లు చేసే వారని, ప్రస్తుతం అధునాతన పద్ధతులు వచ్చాయని, ప్రజలు వాటిని వినియోగించుకుని జనాభా నియంత్రణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో సూపర్ వైజర్లు, పలువురు తదితరులు పాల్గొన్నారు.

టెలికామ్‌నగర్‌లో ఉచిత వైద్య శిబిరం


రాయదుర్గం: ఒమెగా ఆస్పత్రి ఆధ్వర్యంలో టెలికామ్‌నగర్‌లో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కాలనీలోని సాయిదత్త గణపతి దేవస్థానంలో నిర్వహించిన శిబిరంలో బీపీ, ఎస్‌పీఓ 2, బీఎంఐ, ఈసీజీ వంటి సేవలను ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అర్చన, అనురాగ్, వైద్య బృందం పర్యవేక్షణలో 120 మంది స్థానికులకు వైద్య పరీక్షలను నిర్వహించారు. అనంతరం ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, డి నరేందర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రభాకర్, దినేష్‌యాదవ్, స్థానికులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో ఏజెంట్లకు ఆహ్వానం

రాయదుర్గం: టీజీఎస్ ఆర్టీసీ లాజిస్టిక్స్ (కార్గో) గచ్చిబౌలి హెచ్‌సీయూ ఆర్టీసీ డిపో పరిధిలో కార్గో ఏజెంట్ల నియామకం ఉందని ఆసక్తి ఉన్నవారు సంప్రదించాలని ప్రతి ఏజెంట్ రూ.10వేలు (నాన్ రిఫండబుల్) చెల్లించాలని తెలిపారు. ఒక్క పార్సిల్ పైన 15 శాతం కమీషన్ ఉంటుందని డిపో అధికారులు తెలిపారు. ప్రతి ఏజెంట్ కంప్యూటర్, ప్రింటర్ కలిగి ఉండాలని తెలిపారు. బుక్ చేసిన ప్రతి పార్సిల్‌ను కార్గో బస్సు తీసుకెళుతుందన్నారు. ఆసక్తి కలిగిన వారు హెచ్‌సీయూ డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ విజేందర్‌రెడ్డి ఫోన్ నంబర్ 9652267204లో సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.

13న అత్తాపూర్ ఇస్కాన్ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర

రాజేంద్రనగర్: అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయం నుంచి ఈ నెల 13న జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించనున్నట్లు ఇస్కాన్ దేవాలయ జనరల్ మేనేజర్ సచితానందన్ హరిదాస్, దేవాలయ ప్రతినిధి మధుర కన్నయ్య దాస్ తెలిపారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయ ప్రాంగణం నుంచి రథయాత్ర ప్రారంభమవుతుందన్నారు. గురువారం దేవాలయ ఆవరణలో విలేకరులతో మాట్లాడుతూ అత్తాపూర్ ఇస్కాన్ దేవాలయం ఆధ్వర్యంలో శనివారం 3వ రథయాత్రను నిర్వహిస్తున్నామన్నారు. దేవాలయ ప్రాంగణం నుండి కిషన్ బాగ్, తేజశ్రీనగర్ నుంచి పీవీ నరిసింహ రావు ఎక్స్‌ప్రెస్ వే 175 వద్ద గల ఎస్‌బీఆర్ గార్డెన్ వరకు యాత్ర సాగుతుందన్నారు. రథయాత్రలో పది వేల మందికిపైగా భక్తులు పాల్గొంటారన్నారు. ఎస్‌బీఆర్ గార్డెన్‌లో సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మహా హారతి, కీర్తనలు, దీపారాధన కార్యక్రమాలతో పాటు మహా హారతి కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమానికి ఇస్కాన్ దేవాలయాల ముఖ్య స్వాములు సీతారామదాసు, వేదాంద చైతన్యదాసు, ప్రదేశం దాస్, వరద కృష్ణ దాస్, చైతన్య అవతార్ దాస్‌లు హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రతి దేవాలయంలో ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తారని... కానీ ఇస్కాన్ దేవాలయంలోని ప్రధాన విగ్రహమూర్తులను రథయాత్రలో ఊరేగిస్తారని తెలిపారు. దేవుడే భక్తుల కోసం వీధుల్లోకి వస్తాడన్నారు. రథాన్ని లాగడం ద్వారా మోక్షం లభిస్తుందన్నారు. రథయాత్ర ప్రారంభోత్సవం సందర్భంగా దేవాలయ ఆవరణలో, ముగింపు సమయంలో ఎస్‌బీఆర్ గార్డెన్‌లో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ రథయాత్రకు భక్తులు పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు.



వివరాలు వెల్లడిస్తున్న ఇస్కాన్ దేవాలయ జనరల్ మేనేజర్ సచితానందన్ హరిదాస్, ప్రతినిధి మధుర కన్నయ్య దాస్

నాసా పోటీల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

అత్తాపూర్: అంతర్జాతీయ స్థాయిలో నాసా నిర్వహించిన పోటీల్లో హైదర్‌గూడ శ్రీ చైతన్య టెక్నో పాఠశాల విద్యార్థులు సత్తా చాటారు. శ్రీ చైతన్య పాఠశాల రుద్రా టీం విద్యార్థులు మూడో బహుమతి అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్‌కె. దాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తమ విద్యార్థులను అన్ని రంగాల్లో రాణించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఆయన అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం కృష్ణ, ఆర్ఐ హరికృష్ణ, కో – ఆర్డినేటర్లు రవి, ప్రవీణ్, డీన్ సురేష్,ఐపీఎల్ ఇన్‌చార్జి నరేష్, యాదగిరి, నాటా ఇంచార్జి దేవి, రంజిత్ పాల్గొన్నారు.

'పార్ట్‌నర్‌షిప్‌లో మోసానికి పాల్పడలేదు'

గచ్చిబౌలి: హోలిక్ బార్బిక్యూలో పార్ట్‌నర్‌షిప్‌లో ఎలాంటి మోసానికి పాల్పడలేదని యజమాని శ్రీలక్ష్మీపేర్కొన్నారు. హోలిక్ బార్బిక్యూ వ్యవహారంలో మౌనిక, ఆమె భర్త ధరణి చేసిన ఆరోపణలను ఆమె ఖండించారు. మౌనిక పెట్టిన పెట్టుబడిని ఎల్‌ఎల్‌పీ నిబంధనల ప్రకారం బ్యాంక్ అకౌంట్‌లో ఉంచామని, సెటిల్‌మెంట్ పేపర్లపై సంతకాలు చేసి తీసుకోవాల్సి ఉంటుందన్నారు.

క్రిస్టియన్ శ్మశానవాటికను అడ్డుకుంటాం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో క్రిస్టియన్ శ్మశానవాటికను ఏర్పాటు చేస్తుండడంతో స్థానికులు ఎమ్మెల్యే, కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్‌లను కలిసి పనులు నిలిపి వేయాలని కోరారు. అయితే పనులను ఆపకపోగా కాలనీ వాసులపైన ఒత్తిడి తీసుకొచ్చి పోలీసుల సహకారంతో గురువారం పనులు చేపట్టారు. పరిసర ప్రాంతాల ప్రజలు పనులను అడ్డుకోవడంతో ప్రజాప్రతినిధులకు వారికి వాగ్వాదం జరిగింది. దీంతో అసహనంతో ప్రజా ప్రతినిధులు కాలనీ వాసులను బెదిరించడంతో వారు సమస్యను బీజేపీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన స్థానిక బీజేపీ నాయకులు మహాలింగంగౌడ్, కె.మహేష్ యాదవ్‌లతో కలిసి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కాలనీ వాసులను అడిగి వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని విఘ్నేశ్వర కాలనీలో కాలనీ వాసులు అనుమతి లేకుండా బలవంతంగా ఒక మతానికి సంబంధించిన శ్మశానవాటికను అధికారులు ఎలా ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగా ఉండగా విఘ్నేశ్వర కాలనీలో ఉన్న 17 గుంటల స్థలంలో క్రిస్టియన్ శ్మశానవాటికను ఏర్పాటు చేయడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు ప్రజలకు అండగా నిలవాలి కానీ ఒక వర్గానికి కొమ్ముకాయ వద్దని నాయకులకు సూచించారు. ఈ ప్రాంతంలో నివసించే వారు రూ. కొట్లు వెచ్చించి ఇళ్లను కొనుగోలు చేశారని వారిని భయందోళన గురి చేసేలా ప్రజాప్రతినిధులు చేయడం దారుణమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా విఘ్నేశ్వర కాలనీలో క్రిస్టియన్ శ్మశానవాటిక పనులను అడ్డుకుంటామన్నారు. సదరు స్థలంలో పార్కును ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ నాయకులు శేఖర్‌రెడ్డి, లక్ష్మినరసమ్మ, శివలాలా, భువనేశ్వరుని, అనురాధా, శ్రీనివాస్, ప్రవీణ్, పవన్, సాయి తదితరులున్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న బీజేపీ నాయకులు తోకల శ్రీనివాస్‌రెడ్డి

సీబీఐటీకి స్వయం ప్రతిపత్తి పొడిగింపు

మణికొండ: ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాల విభాగంలో రాష్ట్రంలోనే మొదటి స్థానంలో ఉన్న గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ) కళాశాలకు కొనసాగుతున్న స్వయం ప్రతిపత్తి హోదా యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషనర్(యూజీసీ) మరో పదేళ్లు పొడిగించింది. 2024–25 విద్యాసంవత్సరం నుంచి 2033–34 విద్యా సంవత్సరం వరకు ఇది వర్తించనుంది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గురువారం మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన గుర్తింపు విద్యార్థుల్లో అకడమిక్ ఎక్సలెన్స్, ఇన్నోవేషన్, సమగ్రాభివృద్ధికి ఉపయోగపడుతుందన్నారు. సీబీఐటీ తమ స్వంత పాఠ్యాంశాలను రూపొందించటం, పరీక్షలను నిర్వహించటానికి, విద్యార్థులన స్వతంత్రంగా మూల్యాంకనం చేయటానికి ఈ గుర్తింపు అనుమతిస్తుందన్నారు. ఈ స్వయం ప్రతిపత్తితో విద్య నాణ్యత మరింత మెరుగుపరచడం, మరిన్ని కోర్సుల పరిచయం, పరిశ్రమ, సమాజం అభివృద్ధికి వేగంగా కృషి చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. అంకిత భావం కలిగిన అధ్యాపకులు, శ్రద్ధగల సిబ్బంది, శ్రమించే విద్యార్థులు, సహాయక వాటాదారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తమ ప్రయాణాన్ని మరింత ఉత్సాహంతో కొనసాగిస్తామని ఆయన పేర్కొన్నారు.తమ స్వయం ప్రతిపత్తి హోదాను రాబోయే పదేళ్లు పొడిగించినందుకు ఆయన యూజీసీకి కృతజ్ఞతలు తెలిపారు.



గండిపేటలోని సీబీఐటీ కళాశాల భవనం

న్యాయవాదులపై పోలీసుల దాడి అమానుషం



విధులు బహిష్కరించి నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

రాజేంద్రనగర్: సిద్దిపేటలో న్యాయవాది రవి కుమార్‌పై పోలీసులు దాడి చేయడం దారుణమని రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శీలం తిరుపతి రెడ్డి అన్నారు. ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ తెలంగాణ పిలుపు మేరకు గురువారం రాజేంద్రనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు కోర్టులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ... సిద్దిపేట న్యాయవాదిపై పోలీసులు దాడి అమానవీయమన్నారు. చట్ట వ్యతిరేకమన్నారు. విధి నిర్వహణలో భాగంగా వేరే కేసులో నిందితుడిగా ఉన్న తన క్లయింట్ ముందస్తు బెయిల్ కోసం వెళ్లిన న్యాయవాదిపై పోలీసులు దాడి చేయడం దారుణమన్నారు. ఈ దాడిని ముక్తకంఠంతో ఖండిస్తున్నామన్నారు. బాధిత న్యాయవాదికి న్యాయం జరగాలన్నారు. తప్పు చేసిన పోలీసుపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. న్యాయవాదులు రక్షణ చట్టాన్ని వెంటనే అమలు చేయాలన్నారు. న్యాయవాదులపై కక్షపూరితంగా దాడులు చేయడం పోలీసులకు అలవాటుగా మారిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎన్నోసార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు న్యాయవాదుల పరిరక్షణ చట్టం తీసుకురావాలని విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదని ఆవేదన చెందారు. న్యాయవాది తన విధి నిర్వహించే క్రమంలో ఎవరిపైన ఎలాంటి వ్యక్తిగత కక్షతో కేసులు వాదించడం జరగదన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి టీఎల్.శ్రీధర్ రెడ్డి, ప్రతాప్ గౌడ్, కృష్ణ నాయక్, వెంకటేశం, రాజేందర్, పెంటారెడ్డి, భూపాల్, అయ్యప్ప రెడ్డి, పూర్ణ చందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఐదు డివిజన్లలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలు



డిప్యూటీ కమిషనర్ రవి కుమార్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో శుక్రవారం డ్రై డే, ఫ్రై డే కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సర్కిల్ డిప్యూటి కమిషనర్ రవి కుమార్ తెలిపారు. గురువారం తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఫ్రై డే, డ్రై డే కార్యక్రమాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఐదు డివిజన్లలోని ప్రధాన పాఠశాలల్లో ఉదయం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థులతో పాటు కాలనీ, బస్తీ, అపార్ట్‌మెంట్, విల్లాలతో పాటు స్థానిక వ్యాపారస్తులతో కలిసి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరిని కార్యక్రమంలో భాగస్వాములను చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శ్మశానవాటికల అభివృద్ధికి కృషి



మంచిరేవులలో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులను ప్రారంభించిన చైర్‌పర్సన్, కమిషనర్

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని శ్మశానవాటికలను ఆయా కులాలు, మతాలకు అనుగుణంగా సమగ్రంగా అభివృద్ధి చేస్తామని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ అన్నారు. గురువారం మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవులలో రూ. 30లక్షలతో ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధి పనులను ఆమె కమిషనర్ టి. ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్ లంకల పద్మ వీరారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని వార్డుల్లో శ్మశాన వాటికలను నందనవనాలుగా అభివృద్ధి చేసేందుకు కార్యాచరణతో పనిచేస్తున్నామన్నారు. అందులో బాగంగా ఇప్పటికే మూడు శ్మశాన వాటికల్లో పనులను మొదలు పెట్టామన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ లంకల పాపిరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఎన్. బుచ్చిరెడ్డి, నాయకులు డి.లక్ష్మణ్, డి. యాదయ్య, భాస్కర్, మహ్మద్ అఫ్జల్, అక్బర్, ఆజం, గౌస్, రవి తదితరులు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో వారాహి దేవి నవరాత్రి ఉత్సవాలు



ఆలయంలో కొలువుదీరిన అమ్మవారు



రాజేంద్రనగర్: బుద్వేల్ కట్ట మైసమ్మ దేవాలయంలో వారాహి దేవి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. అమ్మవారిని ప్రతిరోజు ప్రత్యేకంగా అలంకరిస్తున్నారు. స్థానిక ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గురువారం దేవాలయ ఆవరణలో నిర్వహించిన పూజల్లో స్థానిక ప్రాంతాలకు చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ప్రతిరోజు దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య పూజలు నిర్వహిస్తున్నారు. దేవాలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ప్రథమ సంవత్సరం విద్యార్థులకు వెల్‌కమ్ పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అంజయ్య మాట్లాడుతూ... ఇది మంచి సంప్రదాయమని కొత్తగా వచ్చిన విద్యార్థుల్లో భయం పోగొట్టేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. అధ్యాపకులు పాటలు, మాటల ద్వారా విద్యార్థులను ఉత్తేజపరిచారు. కార్యక్రమంలో విద్యార్థులే వ్యాఖ్యాతలుగా కార్యక్రమాన్ని ఉర్రుతలూగించారు. అనంతరం విద్యార్థులు నటనలతో, డ్యాన్సులు, పాటలతో ఎంజాయ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మాన్య, స్వప్న, కిరణ్ కుమార్, ఎస్.చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, మురళీ, శ్రీజన్య, కరుణాకర్, నవీన్, కిషన్, గోపి కృష్ణారెడ్డి, చంద్రశేఖర్, శశిధర్, నర్సింగ్, కుమార్, పర్వీన్, రఫి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నాయకుడు అదృశ్యం

- కిడ్నాప్‌గా నార్సింగి పోలీసులకు ఫిర్యాదు
- దర్యాప్తు చేస్తున్న పోలీసులు



నరేందర్‌మాదిగ (ఫైల్)

మణికొండ: ఎమ్మార్పీఎస్ నాయకుడు అదృశ్యమైన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నెక్నాంపూర్ గ్రామానికి చెందిన ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు నరేందర్‌మాదిగ బుధవారం ఓ మిత్రుడితో కలిసి మణికొండ మున్సిపల్ కార్యాలయానికి వచ్చాడు. అనంతరం అతడితో కలిసి నార్సింగి వైపు వెళ్లిపోయాడు. సాయంత్రమైనా అతను తిరిగి రాకపోగా, అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో ఆందోళనకు గురైన అతని సోదరుడు రవీందర్ గురువారం ఉదయం నార్సింగి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గండిపేట రోడ్డులోని బృందావన్ కాలనీలో ఓ ప్లాట్ విషయంలో అతను మధ్యవర్తిగా ఉన్నాడు. సదరు ప్లాట్ మరొకరి ఆధీనంలో ఉందని, ఈ విషయమై గొడవ జరుగుతున్నట్లు అతని మిత్రులు పేర్కొన్నారు. సదరు ప్లాట్‌పై కబ్జాలో ఉన్న వారే నరేందర్‌ను కిడ్నాప్ చేసి ఉండవచ్చునని వారు అనుమానిస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.